క్లుప్తంగా

నేడు గ్రీవెన్స్ డే

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) నిర్వహించనున్నట్లు కమిషనర్ నరసింహప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి స్పందన జరుగుతుందని, ప్రజల ఫిర్యాదులు స్పందనలో స్వీకరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

బంగారుపాళెం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్ తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రజాసమస్యలపై వినతులను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. గ్రీవెన్స్‌డే కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పూతలపట్టు: మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్య పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ గుర్రప్ప ఓ ప్రకటనలో తెలిపారు. మండల ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో తహసీల్దార్‌కు అందజేయాలని తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఎవరి వాస్తవానికి వారే సృష్టికర్తలు


బాలకృష్ణ

తవణంపల్లె: ఎవరి వాస్తవానికి వారే సృష్టికర్తలని ఇందులో ఇతరులకు ఏ మాత్రం సంబంధం ఉండదని హైదరాబాద్‌కు చెందిన సీనియర్ పిరమిడ్ గ్రాండ్ మాస్టర్ బాలకృష్ణ, బెంగళూరుకు చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ ధానర్షి ప్రేమనాథ్ పేర్కొన్నారు. ఆదివారం కాణిపాకం సమీపంలోని శ్రీ విఘ్నేశ్వర పిరమిడ్ మహాశక్తి క్షేత్రంలో మూడు రోజులపాటు నిర్వహించనున్న సేథ్ మహావిజ్ఞానం వర్క్‌షాప్‌లో ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. వివిధ జిల్లాల నుంచి 12 మంది సీనియర్ పిరమిడ్ మాస్టర్లు ఆత్మజ్ఞానాన్ని అందించడానికి కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

రేపు రీసర్వేపై గ్రామసభ

గుడిపాల: రీ సర్వేపై మంగళవారం గ్రామసభ నిర్వహిస్తున్నట్లు గుడిపాల తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని బందార్లపల్లె రెవెన్యూలో మంగళవారం ఉదయం 10.30కు గ్రామసభ నిర్వహిస్తామన్నారు. గతంలో జరిగిన రీసర్వేలో ఏమైనా పొరబాట్లు ఉన్నట్లయితే సరిదిద్దుకోవచ్చన్నారు. వీటిని రైతులందరూ సద్వినియోగం చెసుకోవాలని ఆయన తెలిపారు.

చిత్తూరులో ఐశ్వర్య రాజేష్ సందడి


మీడియాతో మాట్లాడుతున్న ఐశ్వర్య రాజేష్

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరులో ఆదివారం సినీ నటి ఐశ్వర్య రాజేష్ సందడి చేసింది. పలమనేరు రోడ్డులోని జోస్ అలుకాస్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. అభిమానులు ఆమెతో సెల్ఫీలు తీసుకునేందుకు ఎగబడ్డారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సంక్రాంతికి వస్తున్న సినిమా పూర్తి కావస్తోందని తెలిపారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో మరో సినిమా ప్రారంభం కానున్నట్లు తెలిపారు. అభిమానులకు ముందస్తు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యుత్ బిల్లుల వివరాలు పంపండి

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలోని విద్యాశాఖ అనుబంధ కార్యాలయాల విద్యుత్ బిల్లుల వివరాలను పంపాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఉత్తర్వుల మేరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యాశాఖ కార్యాలయాల్లో ఈ నెల వరకు పెండింగ్ విద్యుత్ బిల్లుల వివరాలను సంబంధిత ప్రొఫార్మాలో పంపాలన్నారు. ఈనెల 31వ తేదీలోపు రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయానికి వివరాలు పంపేలా డీఈఓ పర్యవేక్షించాలని ఆదేశించారు.

డీఎల్ఈడీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా వ్యాప్తంగా వచ్చే నెల 4వ తేదీ నుంచి నిర్వహించనున్న డీఎల్ఈడీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు విద్యాశాఖ ఏడీ వెంకటేశ్వరరావు వెల్లడించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ జిల్లాలో వచ్చే నెల 4వ తేదీ నుంచి 7వ తేదీ వరకు డీఎల్ఈడీ పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా కసరత్తు చేస్తున్నామన్నారు. అభ్యర్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పరీక్షలు సంబంధిత షెడ్యూల్ ప్రకారం ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు నిర్వహించబడతాయని వెల్లడించారు.

ప్రయాణం.. ప్రమాదం!


ఐరాల: పాటూరు రోడ్డు దుస్థితి


తవణంపల్లె: టి.పుత్తూరు రోడ్డులో పీహెచ్‌సీ వద్ద రోడ్డు దుస్థితి

- అధ్వాన్నంగా మారిన ఐరాల- పాటూరు రహదారి
- వర్షాలకు గుంతల్లో నీరు చేరి మడుగులను తలపిస్తున్న వైనం
- రాత్రి వేళ ప్రమాదాలు సంభవించే అవకాశం
- మరమ్మతులు చేపట్టని అధికారులు

ఐరాల: పదిరోజులుగా కురిసిన వర్షాలకు రహదారులు ఛిద్రమయ్యాయి. ఐరాల నుంచి పాటూరుకు వెళ్లే రహదారి స్థానిక జెండామాను వద్ద గుంతలమయంగా మారిపోయింది. ప్రస్తుతం గ్రామీణ రోడ్లన్నీ పిల్ల కాలువలను తలపిస్తున్నాయి. అధికారులు గుంతలు పడ్డ చోట తాత్కాలికంగా గుంతలను పూడ్చి మరమ్మతులు చేయాలనే ఆలోచనే చేయడంలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వందరోజుల పాలనలో అభివృద్ధి చేశామనే సంబరాలు చేసుకోవడం తప్ప, రహదారులను పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిత్యం వేల సంఖ్యలో రాకపోకలు

ఐరాల- పాటూరు మార్గం గుండా పవిత్ర పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయానికి నిత్యం వేల సంఖ్యలో ఇతర జిల్లాల నుంచే కాకుండా తెలంగాణ రాష్ట్రం నుంచి కూడా కార్లు, బస్సులు, లారీలు, ఇతర వాహనాలు వెళ్తుంటాయి. జెండామాను వద్ద పెద్దపెద్ద గుంతలు పడడం, వర్షానికి నీరు చేరడంతో వాగును తలపిస్తోంది. ఈ మార్గం గుండా ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, విద్యార్థులు, గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే ద్విచక్ర వాహనదారులు, పాదచారులపై మురుగునీరు పడుతుండడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాసమస్యలు పెరిగిపోతున్నా పాలకులు, అధికారులు వాటి పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవు. వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలుతుండడంతో నీటి నిల్వలు పెరిగితే వ్యాధులు ప్రబలి ప్రజలు మంచం పట్టే ప్రమాదం పొంచి ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తాత్కాలిక మరమ్మతుల్లేవు

రోడ్ల గుంతలు పడిన చోట తాత్కాలికంగా మట్టి, కంకర వేసి మరమ్మతులు చేయాలనే విషయాన్ని అధికారులు మరచిపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వంద రోజుల పాలనలో అభివృద్ధి చేశామని చెబుతున్నారే కానీ కళ్లముందు కనిపిస్తున్న రహదారులు దుస్థితి కనిపించడం లేదని పలువురు ప్రయాణికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి రోడ్ల మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

గ్రామీణ రోడ్లు ఛిద్రం

తవణంపల్లె: తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు మండలంలోని రహదారులు ఛిద్రమైపోయాయి. రోడ్లు ఎక్కడ చూసినా గుంతలమయంగా మారాయి. వాహనాలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకున్న పాపానపోలేదు. రహదారులు గుంతలమయంగా మారడంతో వర్షం నీరు రోడ్డుపై నిలుస్తోంది. చిత్తూరు- అరగొండ ప్రధాన రహదారిలో కాణిపాకం, ఐరాల, అరగొండ, అర్ధగిరి వెళ్లే వాహనాలు రద్దీగా తిరుగుతున్నాయి. ప్రధాన రహదారిలో గోతులు అధికంగా ఉండడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు తొలగడానికి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. వేగంగా వచ్చే వాహనాలు, ద్విచక్ర వాహనదారులు గుంతల్లో చక్రాలు ఇరుక్కుపోవడంతో కింద పడిపోయి ప్రమాదాలకు గురవుతున్నారు. చిత్తూరు-అరగొండ ప్రధాన దారి గుంతలమయంగా మారడంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. తవణంపల్లె నుంచి టి.పుత్తూరు మీదుగా పొన్నేడుపల్లె వరకు ఉన్న తారు రోడ్డు గుంతలు ఏర్పడి వాహనదారులు నరకయాతన పడుతున్నారు. జొన్నగురకల రోడ్డు, గాజులపల్లె నుంచి సరకల్లు రోడ్డు సైతం దారుణంగా ఉంది. ఎక్కడ చూసినా గుంతలతో నిండి ఉంది. ఉత్తరబ్రాహ్మణపల్లె రోడ్డు, దిగువ మోదలపల్లె నుంచి నలిశెట్టిపల్లె మీదుగా చెర్లోపల్లె బైపాస్ వరకు తారు రోడ్డు గుంతలు పడింది. రోడ్లు ఎక్కడ చూసినా గుంతలు పడడంతో ఆర్టీసీ బస్సులు, స్కూల్ బస్సులు, పాలవ్యాన్లు సకాలంలో గమ్యస్థానాలు చేరుకోవడం లేదు.




తవణంపల్లె: పైపల్లె క్రాస్ సమీపంలో చర్చి దగ్గర రోడ్డుపై ఏర్పడిన గోతులు, ఉత్తరబ్రాహ్మణపల్లె సమీపంలో రహదారిపై ఏర్పడిన గుంతలు, ఐరాల : పిల్ల కాలువలా మారిన నాగంవాండ్లపల్లె రోడ్డు

విద్యార్థులకు బహుమతుల ప్రదానం


బహుమతులు ప్రదానం చేస్తున్న వ్యవస్థాపకులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): న్యూట్రిన్ గ్రూప్ వ్యవస్థాపకులు ద్వారకనాథరెడ్డి శత జయంతిని పురస్కరించుకుని చిత్తూరులోని టీటీడీ కల్యాణ మండపంలో ఆదివారం ద్వారకనాథరెడ్డి రమణార్పణం ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ పోటీలకు వివిద రాష్ట్రాలకు చెందిన 700 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. దేశ సంస్కృతి, సంప్రదాయాన్ని ప్రతిబింబించే వ్యాసరచన కథ పోటీలను నిర్వహించారు. ట్రిక్ పాఠశాల ట్రస్టీ పద్మశ్రీ అనితారెడ్డి మాట్లాడుతూ ద్వారకనాథ్‌రెడ్డి స్ఫూర్తితో పేద పిల్లలను ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉన్నత విద్యను చదివిస్తున్నట్లు పేర్కొన్నారు.

బాస్కెట్ బాల్ విజేత చిత్తూరు జట్టు



రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయం సాధించిన చిత్తూరు జట్టు క్రీడాకారులు

చిత్తూరు కలెక్టరేట్: రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్ బాస్కెట్‌బాల్ పోటీల్లో చిత్తూరు జిల్లా జట్టు విజేతగా నిలిచింది. ఈ నెల 25 నుంచి 26వ తేదీ వరకు కర్నూలు జిల్లా డీఎస్‌ఏ మైదానంలో రాష్ట్ర స్థాయి పురుషుల బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న చిత్తూరు జిల్లా జట్టు రసవత్తరంగా ఆట కొనసాగించింది. రాజమండ్రి జట్టుపై గెలుపొంది ఫైనల్స్‌కు చిత్తూరు జిల్లా జట్టు చేరుకుంది. ఫైనల్స్‌లో కర్నూలు జిల్లా జట్టుతో తలపడి 90–58 స్కోరుతో చిత్తూరు జిల్లా జట్టు విజయం సాధించింది. ఈ పోటీల్లో చిత్తూరు జిల్లా జట్టు చాంపియన్‌షిప్ కైవసం చేసుకుంది. విజయం సాధించిన చిత్తూరు జిల్లా జట్టు క్రీడాకారులను జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం కార్యదర్శి సురేష్ బాబు, రాష్ట్ర బాస్కెట్‌బాల్ సంఘం అధ్యక్షుడు భాస్కర్ నాయుడు, కోచ్‌లు జేమ్స్, పీసీఆర్ పీడీ బాబు, జాను అభినందించారు.

నేడు వేదగిరివారిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్

ఐరాల: మండలంలోని వేదగిరివారిపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. 104 వాహనంలో దీర్ఘకాలిక రోగులకు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని చెప్పారు. గ్రామస్తులు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గ్రామ చావడికి మోక్షం ఎప్పుడో ?


కూలడానికి సిద్ధంగా ఉన్న గ్రామ చావడి

తవణంపల్లె: మండల కేంద్రంలో గ్రామ చావడి శిథిలావస్థకు చేరుకుంది. బ్రిటీష్ కాలంలో నిర్మించిన గ్రామ చావడి గోడలు బీటలు వారడంతో ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. గ్రామ చావడిని తొలగించాలని స్థానికులు పలుమార్లు రెవెన్యూ అధికారులకు, పాలకులకు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ శిథిల భవనం పక్కనే ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థులు వస్తుంటారు. ఈభవనం ఎప్పుడు కూలి ప్రమాదం సంభవిస్తోందని ఆందోళన చెందుతున్నారు. జిల్లా, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు రాహుకేతు పూజలు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయంలో నేడు రాహుకేతు పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి మునిరాజు తెలిపారు. ఈ సందర్భంగా స్వయంభు శ్రీమొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ మూలవర్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేయనున్నట్లు చెప్పారు. అనంతరం ఆలయం ఆవరణలో రాహుకాల సమయం ఉదయం 7.30 గంటల నుంచి 9 గంటల మధ్య రాహు, కేతు, సర్పదోష నివారణ పూజలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ప్రత్యేక పూజా కార్యక్రమంలో భక్తులు పాల్గొని దోష నివారణ చేసుకోవాలని కోరారు.

కళకళలాడుతున్న కంది పంట


వీఎస్.అగ్రహారంలో కళకళలాడుతున్న కంది పంట

ఐరాల: మండల వ్యాప్తంగా ఖరీఫ్ ప్రారంభం నుంచి వర్షాలు పడకపోవడంతో రైతులు ఇబ్బంది పడ్డారు. మధ్యలో అక్కడక్కడ కొంతమేర అరకొరగా కురిసిన వర్షాలకు చాలామంది రైతులు వివిధ పంటలు సాగు చేశారు. అయితే వర్షం పడకపోవడంతో సాగైన పంటలు వాడుముఖం పట్టి, ఎండిపోయే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఖరీఫ్ సీజన్ చివరి దశలో మండల వ్యాప్తంగా భారీ వర్షాలు కురవడంతో పంటలు కళ కళలాడుతున్నాయి. మండలంలో 15 హెక్టార్లల్లో రైతులు కంది పంట సాగు చేశారు. మూడు, నాలుగు రోజులుగా వర్షం తెరిపిచ్చింది. అన్ని పంటలు జీవం పోసుకున్నాయి. ఇందులో కంది పంట కళకళలాడుతున్నాయి. ఎటుచూసినా పచ్చదనమే కనిపిస్తోంది. అయితే అధిక వర్షం కారణంగా కొన్నిచోట్ల వరి పంట బాగా దెబ్బతిన్న పరిస్థితి నెలకొంది. లోతట్టు పొలాల్లో పంటలు బాగా దెబ్బతినడంతో రైతులు నష్టపోయారు.

ఆర్థిక బకాయిలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

- యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు శ్రీనివాసరావు డిమాండ్

చిత్తూరు కలెక్టరేట్: ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘం నాయకులు ఆదివారం జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు నూతన వేతన కమిటీని నియమించాలన్నారు. 33 శాతం మధ్యంతర భృతి (ఐఆర్)ను వెంటనే ప్రకటించాలన్నారు. దీపావళి పండుగ సందర్భంగా ప్రకటించాల్సిన కరువు భత్యం(డీఏ) ప్రకటించాలని కోరారు. నవంబర్ 3, 4 తేదీల్లో పూతలపట్టులో జిల్లా స్వర్ణోత్సవ మహాసభలను విజయవంతం చేసేందుకు టీచర్లు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖరనాయుడు, మణిగండన్, నాయకులు ప్రసన్నకుమార్, రఘుపతిరెడ్డి, రెహానాబేగం, ఏకాంబరం, పార్థసారథి పాల్గొన్నారు.

డీఈఓను కలసిన సంఘాల నేతలు



డీఈఓను కలసిన ఎస్టీయూ నేతలు, డీఈఓకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న యూటీఎఫ్ నేతలు

చిత్తూరు కలెక్టరేట్: నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీఈఓ వరలక్ష్మిని జిల్లాలోని పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలిశారు. మర్యాదపూర్వకంగా డీఈఓను కలసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. సంఘ నాయకులతో డీఈఓ మాట్లాడుతూ విద్యాపరంగా జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిపేందుకు అందరం సమష్టిగా కలసి కృషిచేయాలన్నారు. పదవ తరగతి పరీక్షల్లో మెరుగైన, నాణ్యమైన ఫలితాల సాధనకు ఇప్పటి నుంచే ప్రణాళికబద్ధంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. విద్యాశాఖకు సంబంధించి ఏలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. వీలైనంత త్వరలో సంఘాల నాయకులతో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. డీఈఓను ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గంటామోహన్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మదన్‌మోహన్‌రెడ్డి, బోడె మోహన్, నాయకులు శ్రీదేవి, మునెప్ప, పురుషోత్తం, దేవరాజులురెడ్డి పాల్గొన్నారు. నవంబర్ 3,4 తేదీల్లో పూతలపట్టులో నిర్వహించే యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలకు హాజరుకావాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సోమశేఖర్‌నాయుడు, మణిగండన్, నాయకులు సుధాకర్‌రెడ్డి, మునిరత్నం, రెహనా బేగం పాల్గొన్నారు. కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోషియేషన్ నుంచి జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి రామయ్య, చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ శాఖ అధ్యక్షురాలు దేవకి, ప్రధాన కార్యదర్శి రుక్మాంద, నాయకులు నిరంజన్‌రెడ్డి, హరిప్రసాద్ పాల్గొని డీఈఓకు పుష్పగుచ్ఛం అందజేశారు.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు మందులేవీ?

- జగనన్న పాలనలో ఇంటివద్దే ఉచితంగా అందజేత
- గత ప్రభుత్వ పథకాలను నిలిపివేస్తున్న కూటమి ప్రభుత్వం

గుడిపాల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన ప్రతి పథకాన్ని, కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం నిలిపివేస్తోంది. ప్రజలకు ఎంతో మేలు చేసే పథకం అయినప్పటికీ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిందనే కారణంతో ఆపేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు స్పెషలిస్టు వైద్యులతో వైద్యశిబిరం నిర్వహించి వైద్య పరీక్షలు కూడా అక్కడే నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిలిపివేశారు. అవ్వాతాతలకు గ్రామాలకు వెళ్లి నిర్వహించే వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని కూడా ఆపేశారు. తాజాగా దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఇంటికే మందులు అందించే కార్యక్రమాన్ని కూడా నిలిపేశారు. కిడ్నీ, బీపీ, షుగర్, గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులు ఆస్పత్రికి వెళ్లలేరు. ఇటువంటి వారికి ఇంటికే మందులు అందించడం వల్ల వారికి ఎంతగానో ఉపయోగపడేది. కానీ ఇప్పుడు మందులందని పరిస్థితి నెలకొంది. దీంతో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో రోగులకు ఇంటి వద్దకే మందులు అందించే కార్యక్రమాన్ని జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రారంభించింది. 2024 ఆగస్టు వరకు ఈ కార్యక్రమం ఓ ఉద్యమంలా కొనసాగింది. ఆగస్టు నెలాఖరు నుంచి ఈ ప్రభుత్వం కార్యక్రమాన్ని నిలిపివేసింది.

వైద్యుడి సిఫార్సుపై మందుల అందజేత: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి వచ్చే దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు వైద్యులు పరీక్షించి ఆరోగ్యసురక్ష యాప్‌లో ఏపీఎంఐసీడీ ఫార్మసీ విభాగానికి పంపించేవారు. వైద్యుడు సూచించిన మందులను డౌన్‌లోడ్ చేసుకొని వాటిని వ్యాధిగ్రస్తుడి ఇంటికి ప్యాక్‌చేసి మరీ పోస్ట్ ద్వారా ఇంటికే పంపించేవారు. రోగులకు ఖరీదైన మందులను సైతం ఉచితంగా ఇంటి వద్దకే అందజేసేవారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు చాలామంది ఆస్పత్రికి వెళ్లలేరు. కొంతమంది మంచానికే పరిమితం అయిన వారు ఉన్నారు. ముఖ్యంగా దూర ప్రాంతంలో ఉన్న రోగులు ఆస్పత్రికి వెళ్లలేరు. అటువంటి వారికి ఇంటివద్దకే మందులు పంపించడం వల్ల వారికి చాలా ఉపయోగకరంగా ఉండేది. అంతేకాకుండా మందులకు ఖర్చు కూడా ఆదా అయ్యేది.